DD9 వార్త
తెలుగు దినపత్రిక

**మంచిమాట**

అతి కామం వల్ల రావణాసురుడు, అతి ఆశ వల్ల దుర్యోధనుడు, అతి దానం వల్ల బలి చక్రవర్తి నశించారు. కాబట్టి 'అతి' అన్నింటా వర్జనీయమే.

## బీజేపీ హయాంలో బలహీన వర్గాలకు అన్యాయం



- రాహుల్ గాంధీ సంచలన తీవ్ర ఆరోపణలు
- దళితులు, ఆదివాసీలకుఅన్యాయం
- గుజరాత్‌లో బలహీన వర్గాల పరిస్థితిపై ఆందోళన
- ఉనా బాధితులకు మద్దతుగా రాహుల్ గాంధీ భరోసా
- న్యాయం ఇంకా దూరంగానే ఉందని విమర్శ
- వ్యవస్థపరమైన వైఫల్యమని కాంగ్రెస్ అభిప్రాయం
- హింస, బెదిరింపులతో అణచివేత జరుగుతోందని ఆరోపణ
- పాత ఘటనల గాయాలు ఇంకా మానలేదని వ్యాఖ్య
- దేశవ్యాప్తంగా ప్రభావంపై కూడా రాహుల్ ఆందోళన

**హైదరాబాద్, (డిడి9 వార్త):** గుజరాత్‌లో దళితులు, ఆదివాసీ వర్గాల పరిస్థితిపై మళ్లీ రాజకీయ చర్చలు మొదలయ్యాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో బలహీన వర్గాలపై ద్వేషం, వివక్ష, హింసాత్మక ఘటనలు పెరిగాయని ఆయన అన్నారు. ముఖ్యంగా 2016లో జరిగిన ఉనా ఘటనను ప్రస్తావిస్తూ, బాధితులకు ఇంకా న్యాయం జరగలేదని వ్యాఖ్యానించారు.ఇటీవల ఉనా ఘటన బాధితులు,

మిగతా 2వ పేజీలో..

సంపుటి : 01 సంచిక : 217 హైదరాబాద్, మార్చి, సోమవారం 30, 2026 పేజీలు : 05 వెల : 3.00

# తల్లిదండ్రుల సంరక్షణ బిల్లుకు ఆమోదం



- ఉద్యోగుల జీతాల నుంచి నేరుగా సహాయం
- వృద్ధుల కోసం రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం
- శాసనసభ ఆమోదం పొందిన కొత్త బిల్లు
- తల్లిదండ్రులను చూసుకోకపోతే జీతం నుంచి కోత
- కుటుంబ వ్యవస్థలో మార్పులపై సీఎం ఆవేదన
- కేంద్ర చట్టానికి మించి రాష్ట్ర చర్యలు
- సభలో కాంగ్రెస్, బీజేపీ మధ్య వాగ్వాదం
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంపై ఉద్రిక్తత
- బీజేపీ కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలన్న సీఎం

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ రాష్ట్రంలో వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. కుటుంబ వ్యవస్థల్లో జరుగుతున్న మార్పులు, పిల్లలు పెద్దలను నిర్లక్ష్యం చేసే సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. తల్లిదండ్రులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అనే భావనను బలపరచడానికి "తల్లిదండ్రుల సంరక్షణ - ఉద్యోగుల బాధ్యత" పేరుతో ఒక ప్రత్యేక బిల్లును తీసుకొచ్చింది. ఈ బిల్లును శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టగా, సభ ఆమోదం తెలిపింది.

ఈ చట్టం అమల్లోకి వస్తే, ఉద్యోగులు తమ తల్లిదండ్రులను చూసుకోకపోతే వారి జీతం నుంచి ఒక భాగాన్ని నేరుగా తల్లిదండ్రులకు చెల్లించే విధానం అమల్లోకి రానుంది. ఇది రాష్ట్రంలో వృద్ధుల ఆర్థిక భద్రతను పెంచడమే కాకుండా, కుటుంబ బాధ్యతలను గుర్తు చేసే చర్యగా ప్రభుత్వం భావిస్తోంది. సమాజంలో పెరుగుతున్న నిర్లక్ష్య ధోరణికి ఇది ఒక కఠిన హెచ్చరికగా కూడా భావిస్తున్నారు.శాసనసభలో బిల్లును ప్రవేశపెడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావోద్వేగంగా మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం జీవితమంతా కష్టపడతారని, కానీ పిల్లలు ఎదిగాక వారిని పట్టించుకోకపోవడం బాధాకరమని

మిగతా 2వ పేజీలో..

## అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

- సభలో గందరగోళం.. స్పీకర్ కఠిన నిర్ణయం
- కేటీఆర్, హరీష్ రావుతో పాటు సభ్యులందరు సస్పెండ్
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంపై ప్రతిపక్ష ఆందోళన
- కౌశిక్ రెడ్డి ప్రవర్తనపై తీవ్ర వివాదం
- సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు
- బడ్జెట్ చర్చలకు ఆటంకమంటూ ఆగ్రహం
- సభా సంప్రదాయాలపై చర్చకు దారితీసిన ఘటన

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ శాసనసభలో ఆదివారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతిపక్షమైన భారత్ రాష్ట్ర సమితి ఎమ్మెల్యేల ఆందోళనల నేపథ్యంలో సభలో గందరగోళం చెలరేగింది. ఈ పరిణామాల మధ్య స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కీలక నిర్ణయం తీసుకుని బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేశారు. సభలో నిరంతరంగా అంతరాయం కలిగిస్తున్నారనే కారణంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రెండు రోజుల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ సస్పెన్షన్ జాబితాలో కల్వకుంట్ల తారక రామారావు, టి. హరీష్ రావు వంటి ప్రముఖ నేతలు కూడా ఉన్నారు. ఈ నిర్ణయంతో అసెంబ్లీలో ఉద్రిక్తత మరింత పెరిగింది.ఈ వివాదానికి కేంద్రంగా నిలిచింది రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారం. ఈ కంపెనీకి సంబంధించిన

మిగతా 2వ పేజీలో..



## నీ తమ్ముడిపై సిద్ధమైతే.. నా తమ్ముడిపై నేనూ సిద్ధం

### సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు సవాల్

- సీఎం పై హరీష్ రావు సంచలన ఆరోపణలు
- 20 కుంభకోణాల జాబితా విడుదల
- సిట్టింగ్ జడ్జితో విచారణకు సవాల్
- పారదర్శకతపై సీఎం కు ప్రశ్నలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరోసారి తారాస్థాయికి చేరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతూ సంచలన సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు , ప్రభుత్వంపై వస్తున్న వరుస అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ, రేవంత్ రెడ్డికి దమ్ముంటే విచారణకు రావాలని ఆయన నిలదీశారు. ముఖ్యమంత్రి తమ్ముడు చేసినట్లుగా భావిస్తున్న అవినీతిపై హౌస్ కమిటీ విచారణకు తాను సిద్ధమని, ఒకవేళ అది వద్దనుకుంటే సిట్టింగ్ జడ్జితో విచారణకు రావాలని హరీష్ రావు ఛాలెంజ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తాము గుర్తించిన సుమారు 20 రకాల భారీ కుంభకోణాల

## ఇంధన ధరలపై రాష్ట్రం చర్యలు తీసుకోవాలి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక సూచనలు
- రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్‌పై అత్యధిక వ్యాట్
- కేంద్రం ఎక్సైజ్ తగ్గింపు, రాష్ట్రం మౌనంపై ప్రశ్న
- ఎల్పీజీ, పెట్రోలు, డీజిల్ నిల్వలు పుష్కలం
- ప్రజలకు ఆందోళన వద్దన్న కేంద్ర మంత్రి
- లాక్‌డౌన్ వదంతులు నిజం కాదని హెచ్చరిక
- ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తే అరెస్టు చేయాలి
- చమురు ధరలపై పునర్విచారణకు సూచన



2

## దేశమంతా ఒక్కటిగా నిలబడాలి

- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని పిలుపు
- క్లిష్ట సమయంలో ఐక్యతే బలమన్న మోదీ
- 132వ మన్ కీ బాత్‌లో మోదీ ప్రత్యేక సందేశం
- వదంతులను నమ్మొద్దని ప్రజలకు హెచ్చరిక
- ఇంధన సరఫరాపై యుద్ధ ప్రభావం
- రాజకీయాలు చేయొద్దని పార్టీలకు సూచన
- గల్ఫ్ దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు
- నీటి సంరక్షణపై దేశవ్యాప్త ఉద్యమం
- గ్రామీణ స్థాయిలో మార్పులు తీసుకొచ్చిన నీటి పథకాలు
- రైతులకు భూగర్భ జలాల లభ్యత పెరుగుదల
- ప్రజా భాగస్వామ్యంతోనే స్థిరాభివృద్ధి సాధ్యం



2

DD9 వార్త
DD9 Vartha
సోమవారం
30-03-2026
హైదరాబాద్

## బీజేపీ హయాంలో బలహీన వర్గాలకు అన్యాయం

**మొదటిపేజీ తరువాయి**

దళిత మరియు ఆదివాసీ వర్గాల ప్రతినిధులతో రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. ఈ భేటీకి సంబంధించిన వీడియోను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో జరిగిన దారుణ ఘటనలు ఇప్పటికీ బాధితుల జీవితాలను వెంటాడుతున్నాయని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రకారం, ఉనా ఘటన కేవలం ఒక సంఘటన మాత్రమే కాదు, అది సమాజంలో ఉన్న లోతైన సమస్యలను బయటపెట్టిందన్నారు. బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను వ్యవస్థ సరిగా ఎదుర్కోలేకపోతోందని, నేరస్తులు శిక్ష నుంచి తప్పించుకుంటున్నారని ఆయన విమర్శించారు.

ఆయన మాట్లాడుతూ, బాధిత కుటుంబాలు గత పదేళ్లుగా న్యాయం కోసం పోరాడుతూనే ఉన్నాయని చెప్పారు. న్యాయస్థానాల తలుపులు తడుతూ, అధికారులను సంప్రదిస్తూ తిరుగుతున్నప్పటికీ, ఇంకా సరైన న్యాయం అందలేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితి దేశానికి ఆందోళన కలిగించే అంశమని అన్నారు. గుజరాత్‌లో పరిస్థితి మరింత దిగజారిందని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. దళితులు, ఆదివాసీలపై అవమానాలు, దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. తమ హక్కుల కోసం గళం విప్పిన వారిని లక్ష్యంగా చేసుకుని అణచివేస్తున్నారని అన్నారు. ఈ చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.

హింసాత్మక ఘటనలను ఉదాహరణగా చెబుతూ, కొన్ని కేసుల్లో బాధితులను తీవ్రంగా కొట్టారని, మరికొన్ని ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన వారున్నారని ఆయన చెప్పారు. ఒక వ్యక్తికి తీవ్రంగా దాడి చేసి అనేక ఎముకలు విరిగేలా చేశారని, మరో ఘటనలో వ్యక్తిని సజీవ దహనం చేశారని పేర్కొన్నారు. ఇవి కేవలం విడివిడిగా జరిగే ఘటనలు కావని, భయం సృష్టించే విధానంగా మారాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, బాధితులకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. న్యాయం జరిగేంత వరకు వారి కోసం పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. వారి సమస్యలను దేశవ్యాప్తంగా తెలియజేస్తానని పేర్కొన్నారు.

ఇదే సమయంలో, ఉనా ఘటనను మరోసారి గుర్తుచేశారు. 2016 జూలైలో గిర్‌సోమనాథ్ జిల్లాలో జరిగిన ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఒక గ్రామంలో చనిపోయిన ఆవు చర్మం తీస్తున్న నలుగురు దళిత యువకులపై కొందరు దాడి చేశారు. వారిని బహిరంగంగా అవమానించి కొరడాలతో కొట్టారు. ఈ ఘటన వీడియో బయటకు రావడంతో దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమైంది. ఈ ఘటన తర్వాత పోలీసులు కూడా సరైన విధంగా స్పందించలేదని ఆరోపణలు వచ్చాయి. బాధితులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అక్కడ కూడా దుర్వినియోగం చేశారనే విమర్శలు వినిపించాయి. ఈ సంఘటనపై విచారణలు జరిగినప్పటికీ, పూర్తి స్థాయి న్యాయం ఇంకా జరగలేదని విమర్శలు కొనసాగుతున్నాయి.

రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ఇలాంటి ఘటనలు కేవలం ఒక రాష్ట్రానికి పరిమితం కావని అన్నారు. బలహీన వర్గాలపై అన్యాయం దేశవ్యాప్తంగా పెరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తుచేశారు. అంతేకాకుండా, ఈ పరిస్థితి మారకపోతే సమాజంలో అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దళితులు, ఆదివాసీలు భయపడకుండా జీవించే వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

రాజకీయంగా కూడా ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. కాంగ్రెస్ పార్టీ ఈ సమస్యను పెద్ద ఎత్తున ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని భావిస్తోంది. మరోవైపు బీజేపీ ఈ ఆరోపణలను ఖండించే అవకాశం ఉంది. దీంతో రాబోయే రోజుల్లో ఈ అంశంపై రాజకీయ వాదోపవాదాలు మరింత పెరగనున్నాయి. ఉనా ఘటన మళ్లీ వెలుగులోకి రావడంతో గుజరాత్‌లో దళితుల పరిస్థితిపై చర్చలు మళ్లీ మొదలయ్యాయి. బాధితులకు న్యాయం ఎప్పుడు జరుగుతుందనే ప్రశ్నకు సమాధానం కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ చర్యలు ఎలా ఉంటాయన్నది కీలకంగా మారింది.

## అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

**మొదటిపేజీ తరువాయి**



మైనింగ్ కార్యకలాపాలపై ఆరోపణలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభా సంఘం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై విచారణ జరపాలని కోరుతూ సభలో నినాదాలు చేశారు. అంతేకాకుండా సభకు వస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

సభ ప్రారంభమైనప్పటి నుంచి బీఆర్ఎస్ సభ్యులు నిరంతరం ఆందోళన కొనసాగించారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లే ప్రయత్నం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తమైంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని పదవి నుంచి తొలగించాలని కూడా వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సభా కార్యక్రమాలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తనపై మరో వివాదం చెలరేగింది. సభలో ఆయన ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనుచితంగా ప్రవర్తించారని అధికార పక్షం ఆరోపించింది. ఈ ఘటనపై కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా స్పందిస్తూ, కౌశిక్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ విషయంపై ఎ. రేవంత్ రెడ్డి కూడా తీవ్రంగా స్పందించారు. కౌశిక్ రెడ్డి ప్రవర్తన సభా నియమాలకు విరుద్ధమని, ఇది అంగీకారయోగ్యం కాదని అన్నారు. ఆయన చేసిన చర్యలు వీడియోలో నమోదయ్యాయని, దీనిపై విచారణ జరపాలని సూచించారు. అవసరమైతే ఈ అంశాన్ని ఎథిక్స్ కమిటీకి పంపాలని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి మరోవైపు బీఆర్ఎస్ సభ్యులపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సభలో చర్చలు జరగకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలు, బడ్జెట్ చర్చలు ముందుకు సాగకుండా చేయడమే వారి లక్ష్యమని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై గౌరవం ఉంటే సభా నియమాలను పాటించాలని సూచించారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా బీఆర్ఎస్ సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకోవడం సరైంది కాదని అన్నారు. సభ అనేది ప్రజల సమస్యలు పరిష్కరించే వేదిక అని గుర్తుచేశారు. ఇలాంటి ప్రవర్తన ప్రజాస్వామ్యానికి హానికరమని పేర్కొన్నారు.ఇదే సమయంలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తన కారణంగా సభ సజావుగా నడవడం లేదని పేర్కొంటూ వారిని సస్పెండ్ చేయాలని ప్రతిపాదించారు. ఈ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం స్పీకర్ సస్పెన్షన్ ప్రకటించారు.

అసెంబ్లీలో జరిగిన ఈ ఘటనలతో బడ్జెట్ సమావేశాలు కూడా ప్రభావితమయ్యాయి. ముఖ్యమైన చర్చలు జరగాల్సిన సమయంలో గందరగోళం నెలకొనడం ప్రభుత్వాన్ని అసహనానికి గురిచేసింది. పలుమార్లు హెచ్చరించినప్పటికీ బీఆర్ఎస్ సభ్యులు తమ ఆందోళన కొనసాగించడంతో స్పీకర్ కఠిన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.సభ నుంచి బయటకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనంతరం పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ పరిణామాలపై స్పందించేందుకు వారు సమావేశమయ్యారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ త్వరలో మీడియా సమావేశం నిర్వహించి తమ వైఖరిని వెల్లడించే అవకాశం ఉంది.

ఇదిలా ఉండగా, సభలో మరో కీలక అంశం కూడా చర్చకు వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీష్ రావుపై భూముల వ్యవహారంలో ఆరోపణలు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో భారీగా భూములు అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఆరోపిస్తూ విచారణకు సిద్ధమని తెలిపారు. దీనిపై హౌస్ కమిటీ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. తెలంగాణ అసెంబ్లీలో జరిగిన ఈ పరిణామాలు రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి. ప్రతిపక్షం మరియు అధికార పక్షం మధ్య ఆరోపణలు, ప్రతిఆరోపణలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రాబోయే రోజుల్లో సభా కార్యకలాపాలు ఎలా సాగుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# తల్లిదండ్రుల సంరక్షణ బిల్లుకు ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

ఆయన అన్నారు. సమాజంలో ఇటువంటి సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ చట్టాన్ని తీసుకురావాల్సి వచ్చిందని తెలిపారు.

భారతదేశంలో ఇప్పటికే వృద్ధుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం 2007లో ఒక చట్టం తీసుకువచ్చిందని ఆయన గుర్తు చేశారు. అయితే ఆ చట్టం ప్రకారం తల్లిదండ్రులకు ఇవ్వాల్సిన సహాయం పరిమితంగా ఉందని, నెలకు రూ.10 వేల వరకు మాత్రమే ఇవ్వగలమనే నిబంధన ఉందని పేర్కొన్నారు. ఈ పరిమితి వల్ల చాలా సందర్భాల్లో వృద్ధులకు సరైన సహాయం అందడం లేదని ప్రభుత్వం భావించింది. అందుకే రాష్ట్ర స్థాయిలో మరింత ప్రభావవంతమైన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది.ఈ బిల్లుపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి సమాజ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను చూసుకోని పిల్లలు సమాజానికి మంచి ఉదాహరణ కాదని, అలాంటి వారిని సామాజికంగా నిరాకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడని వ్యక్తి సమాజంలో గౌరవం పొందకూడదని కూడా ఆయన వ్యాఖ్యానించారు.

అలాగే ఈ చట్టం కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే కాకుండా, ప్రజా ప్రతినిధులకు కూడా వర్తిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబ బాధ్యతలు ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తిస్తాయని, అధికారంలో ఉన్నవారు కూడా దీనికి మినహాయింపు కాదని చెప్పారు. అందరూ ఈ చట్టానికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.ఈ బిల్లుకు శాసనసభలో విస్తృత మద్దతు లభించింది. చర్చ అనంతరం సభ ఈ బిల్లును ఆమోదించింది. దీంతో రాష్ట్రంలో వృద్ధుల సంక్షేమానికి కొత్త దిశ ఏర్పడినట్లు భావిస్తున్నారు. ఇది అమలులోకి వచ్చిన తర్వాత కుటుంబాల్లో బాధ్యత భావన పెరుగుతుందని అధికారులు ఆశిస్తున్నారు.

ఇదే సమయంలో అసెంబ్లీ సమావేశాల్లో రాజకీయ వాతావరణం కూడా వేడెక్కింది. కాంగ్రెస్ మరియు బీజేపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బీజేపీ సభ్యులు చేసిన విమర్శలను సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా తిప్పికొట్టారు. సభలో సూచనలు చేసి వెళ్లిపోవడం బీజేపీ సభ్యుల అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు.కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై కూడా చర్చ జరిగింది. ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థలకు అప్పగించినప్పటికీ ఇప్పటికీ పురోగతి కనిపించడంలేదని సీఎం విమర్శించారు. పారదర్శకత కోసం కేసును అప్పగించామని, కేంద్రం కూడా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దీనికి స్పందిస్తూ తమ పార్టీ సభ్యులు బాధ్యతగా వ్యవహరిస్తారని చెప్పారు. మైనింగ్ అక్రమాలపై హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీ లేకపోవడం వల్లే ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్నాయని పేర్కొన్నారు.ఇక సభలో బీఆర్ఎస్ సభ్యులు కూడా ఆందోళనకు దిగారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ వ్యవహారంపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో సభలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఈ అంశంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, ప్రభుత్వం ఇప్పటికే అవసరమైన చర్యలు తీసుకుందని తెలిపారు. మైనింగ్ వ్యవహారాల్లో పారదర్శకత పాటిస్తున్నామని, ప్రభుత్వ ఆదాయానికి ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. తల్లిదండ్రుల సంరక్షణపై తీసుకొచ్చిన ఈ చట్టం తెలంగాణలో ఒక సామాజిక మార్పుకు నాంది పలుకుతుందని భావిస్తున్నారు. కుటుంబ విలువలను కాపాడేందుకు, వృద్ధులకు భరోసా కల్పించేందుకు ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. అదే సమయంలో అసెంబ్లీ సమావేశాల్లో రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగడం రాష్ట్ర రాజకీయ పరిస్థితిని ప్రతిబింబిస్తోంది.



## దేశమంతా ఒక్కటిగా నిలబడాలి

- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని పిలుపు
- క్లిష్ట సమయంలో ఐక్యతే బలమన్న మోడీ
- 132వ మన్ కీ బాత్‌లో మోడీ ప్రత్యేక సందేశం
- వదంతులను నమ్మొద్దని ప్రజలకు హెచ్చరిక
- - ఇంధన సరఫరాపై యుద్ధ ప్రభావం
- రాజకీయాలు చేయొద్దని పార్టీలకు సూచన
- గల్ఫ్ దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు
- నీటి సంరక్షణపై దేశవ్యాప్త ఉద్యమం
- గ్రామీణ స్థాయిలో మార్పులు తీసుకొచ్చిన నీటి పథకాలు
- రైతులకు భూగర్భ జలాల లభ్యత పెరుగుదల
- ప్రజా భాగస్వామ్యంతోనే స్థిరాభివృద్ధి సాధ్యం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

దేశానికి సవాళ్లతో కూడిన పరిస్థితులు ఎదురైనా భారతీయులు ఐక్యంగా నిలబడతారని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులను ప్రస్తావిస్తూ, ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న క్లిష్ట సమయం అని అన్నారు. ఇలాంటి సందర్భాల్లో దేశ ప్రజలందరూ ఒక్కటిగా ఉండటం అత్యంత అవసరమని, అదే మన బలం అని పేర్కొన్నారు. 132వ మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో ప్రధాని తన సందేశాన్ని అందించారు. దేశ భద్రత, ఆర్థిక స్థిరత్వం, ప్రజల సంక్షేమం ఈ అంశాలు పరస్పరం అనుసంధానంగా ఉంటాయని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.తాజాగా జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని, అప్రమత్తత అత్యంత కీలకమని తెలిపారు. ముఖ్యంగా వదంతులు, అసత్య ప్రచారాలు దేశానికి పెద్ద నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న నిర్ధారణలేని సమాచారాన్ని నమ్మకుండా, అధికారిక వనరుల నుంచి వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని ప్రజలను కోరారు. వదంతులు వ్యాప్తి చేయడం అనేది కేవలం వ్యక్తిగత తప్పు మాత్రమే కాదు, దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేయడమేనని అన్నారు.

పశ్చిమాసియా ప్రాంతం ప్రపంచానికి ముఖ్యమైన ఇంధన సరఫరా కేంద్రం అని ప్రధాని గుర్తుచేశారు. అక్కడి ఉద్రిక్తతల కారణంగా పెట్రోలు, డీజిల్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అయితే భారత్ గత కొన్ని దశాబ్దాలుగా నిర్మించుకున్న అంతర్జాతీయ సంబంధాలు ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు సహాయపడుతున్నాయని తెలిపారు. వివిధ దేశాలతో ఉన్న బలమైన సంబంధాలు వల్ల ఇలాంటి సంక్షోభాల్లో కూడా భారత్ స్థిరంగా నిలబడగలుగుతోందని అన్నారు.ఈ తరుణంలో రాజకీయ పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలని ప్రధాని సూచించారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై రాజకీయాలు చేయడం తగదని స్పష్టం చేశారు. ఇలాంటి సున్నితమైన సమయంలో ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వ్యాఖ్యలు చేయకూడదని, రాజకీయ లాభనష్టాలను పక్కనబెట్టి దేశ ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను రాజకీయంగా ఉపయోగించుకోవడం కంటే పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న భారతీయుల గురించి కూడా ప్రధాని ప్రస్తావించారు. లక్షలాది కుటుంబాలు తమ బంధువులపై ఆధారపడి జీవిస్తున్నాయని, వారు సురక్షితంగా ఉండటం అత్యంత ముఖ్యమని అన్నారు. అక్కడి ప్రభుత్వాలు భారతీయులకు సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. విదేశాల్లో ఉన్న భారతీయుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ఇక నీటి సంరక్షణపై కూడా ప్రధాని ప్రత్యేకంగా మాట్లాడారు. దేశంలో నీటి వనరుల పరిరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. గత పదేళ్లలో కోట్లాది మంది ప్రజలు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారని చెప్పారు. వర్షపు నీటిని నిల్వ చేయడం, పాత చెరువులను పునరుద్ధరించడం వంటి చర్యలు గ్రామీణ స్థాయిలో పెద్ద మార్పులకు దారి తీశాయని వివరించారు.

నీటి నిల్వ కోసం నిర్మించిన మౌలిక వసతులు దేశానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. లక్షల సంఖ్యలో చిన్న చెరువులు, ఇంకుడు గుంతలు, నిల్వ ట్యాంకులు నిర్మించడంతో నీటి లభ్యత పెరిగిందని చెప్పారు. “అమృత్ సరోవర్” వంటి కార్యక్రమాల ద్వారా వేలాది నీటి వనరులు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. ప్రజల చైతన్యం, ప్రభుత్వ చర్యలు కలిసివస్తే ఏ సమస్యనైనా అధిగమించవచ్చని ఈ ఉదాహరణలు చూపిస్తున్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు స్వచ్ఛందంగా తీసుకున్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని ప్రధాని వివరించారు. కొన్ని గ్రామాల్లో ప్రతి ఇంటిలో వర్షపు నీటి సేకరణ పద్ధతులను అమలు చేసి నీటి సమస్యను పూర్తిగా తగ్గించుకున్నారని చెప్పారు. ఒకప్పుడు నీటి కొరతతో ఇబ్బందులు పడ్డ ప్రాంతాలు ఇప్పుడు స్వయం సమృద్ధిగా మారుతున్నాయని తెలిపారు.

రైతులు కూడా నీటి సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రధాని అభినందించారు. తమ పొలాల్లో చిన్న చెరువులు తవ్వడం, వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాల స్థాయిని పెంచుతున్నారని చెప్పారు. దీని వల్ల వ్యవసాయం స్థిరంగా కొనసాగుతుందని, రైతుల ఆదాయం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ఇటువంటి చర్యలు దేశవ్యాప్తంగా విస్తరించాలని సూచించారు.దేశం ఎదుర్కొంటున్న అంతర్జాతీయ సవాళ్లు మరియు అంతర్గత సమస్యల మధ్య ప్రజల ఐక్యత, అప్రమత్తత, బాధ్యతాయుత ప్రవర్తనే కీలకమని ప్రధాని సందేశం ఇచ్చారు.

## నీ తమ్ముడిపై సిద్ధమైతే.. నా తమ్ముడిపై నేనూ సిద్ధం

**మొదటిపేజీ తరువాయి**

జాబితాను సిద్ధం చేసి, వాటిపై విచారణ కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ సంతకాలు చేసిన లేఖను ముఖ్యమంత్రికి పంపినట్లు హరీష్ రావు వెల్లడించారు. ఈ జాబితాలో ప్రధానంగా అమృత్ టెండర్ల కుంభకోణం, సివిల్ సప్లైస్ స్కామ్, లగచర్ల ల్యాండ్ స్కామ్, ఫోర్త్ సిటీ , యంగ్ ఇండియా స్కూల్ స్కామ్‌లను ఆయన ప్రస్తావించారు. వీటితో పాటు సింగరేణి ఓబీ టెండర్లు, నైనీ కోల్ బ్లాక్, ఎన్టీపీసీ థర్మల్ పవర్ స్కామ్ , ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో మైక్రో బ్రూవరీస్, కోటి ఎకరాల నిషేధిత భూముల జాబితాలో జరిగిన అక్రమాలను కూడా హరీష్ రావు ఎండగట్టారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను ఎంతో పారదర్శకంగా ఉన్నానని గతంలో అసెంబ్లీలో చెప్పిన మాటలను హరీష్ రావు ఈ సందర్భంగా గుర్తుచేశారు. “ముఖ్యమంత్రి గారు.. మీరు నిజంగా సత్యహరిశ్చంద్రుడైతే, ఏ తప్పూ చేయకపోతే, మీలో చీము నెత్తురు ఉంటే మీరు అసెంబ్లీలో చెప్పిన దాని ప్రకారం ఈ 20 స్కామ్‌లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి” అని ఘాటుగా విమర్శించారు. ఒకవేళ సిఐడి (CID) విచారణపై నమ్మకం లేకపోతే, నేరుగా సిట్టింగ్ జడ్జి సమక్షంలోనే విచారణకు వెళ్దామని, నిజాయితీ ఉంటే భయపడాల్సిన అవసరం లేదని హరీష్ రావు స్పష్టం చేశారు. ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నిస్తున్నామని, తన నిజాయితీని నిరూపించుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపైనే ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

## ఇంధన ధరలపై రాష్ట్రం చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్, (డిడి9 వార్త):**



డి" కిషన్‌రెడ్డి, బొగ్గు, గనుల శాఖ మంత్రి

ఇజ్రాయెల్ , అమెరికా ఇరాన్ యుద్ధం కారణంగా పెరుగుతున్న చమురు ధరలను అదుపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని తగ్గించింది. ఇదే నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలపై భారం పడకుండా రాష్ట్రాలు కూడా వ్యాట్‌ను తగ్గించుకోవాలి అని బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఎల్పీజీ, పెట్రోలు, డీజిల్ నిల్వలపై తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించేందుకు హైదరాబాద్‌లోని సీజీఐ టవర్స్‌లో కిషన్‌రెడ్డి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ గ్యాస్ సమస్యలపై వస్తున్న వదంతులను ప్రస్థావించారు.

వ్యాట్ ఎందుకు తగ్గించరు : పెట్రోలు, డీజిల్‌పై దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రాష్ట్రం వ్యాట్ విధిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గత పన్నెండేళ్లగా ఇది 35.20 శాతంగా ఉంటోందని తెలిపారు. గతంలో పాలించిన కేసీఆర్ ప్రజాపాలన అంటూ డప్పు కొట్టుకుంటున్న కాంగ్రెస్ పార్టీ దీనిలో ఒక్కపైసా కూడా వ్యాట్‌ను తగ్గించలేదని వెల్లడించారు. మన పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌లో 31 శాతంగా విధిస్తుండగా, మహారాష్ట్రలో 26 శాతం, కర్ణాటకలో 29 శాతంగా ఉన్నాయని ప్రస్థావించారు. అయితే తెలంగాణలో మాత్రం ఎందుకని 35.20 శాతం విధిస్తున్నారు? దీనిని ఎందు తగ్గించండం లేదు? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.

ఆందోళన వద్దు : రాష్ట్రంలో పుష్కలంగా ఎల్పీజీ, పెట్రోలు, డీజిల్ నిల్వలు ఉన్నాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. చమురు సంస్థలు పెట్రోల్ , గ్యాస్ ఏజెన్సీలకు మూడు రోజుల పాటు క్రెడిట్ సౌకర్యాన్ని ఇస్తున్నారని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మొద్దని ప్రస్థావించారు.

"పెట్రోలు, డీజిల్‌పై దేశంలోనే అత్యధికంగా తెలంగాణ రాష్ట్రం వ్యాట్ విధిస్తోంది. గత పన్నెండేళ్లగా ఇది 35.20 శాతంగా ఉంటోంది. గతంలో పాలించిన కేసీఆర్ ప్రజాపాలన అంటూ డప్పు కొట్టుకుంటున్న కాంగ్రెస్ పార్టీ దీనిలో ఒక్కపైసా కూడా వ్యాట్‌ను తగ్గించలేదు. మన పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌లో 31 శాతంగా విధిస్తుండగా, మహారాష్ట్రలో 26 శాతం, కర్ణాటకలో 29 శాతంగా ఉన్నాయి. అయితే తెలంగాణలో మాత్రం ఎందుకని 35.20 శాతం విధిస్తున్నారు? దీనిని తగ్గించండి" కిషన్‌రెడ్డి, బొగ్గు, గనుల శాఖ మంత్రి

లాక్‌డౌన్ వదంతులను నమ్మొద్దు : దేశంలో మళ్లీ లాక్‌డౌన్ విధించనున్నారనే వదంతులను నమ్మొద్దని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి మోదీ లోక్‌సభలో మాట్లాడిన మాటల్లో సారాంశాన్ని పూర్తిగా అర్థం చేసుకోకుండా లాక్‌డౌన్ విధిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వేల సంఖ్యలో పోస్టు అప్‌లోడ్ చేశారని వెల్లడించారు. మన దేశానికి రావాల్సిన చమురు, గ్యాస్‌ను సకాలంలో తెప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా ఈ సమస్యపై పర్యవేక్షిస్తుని తెలిపారు. ప్రజలు ఎల్పీజీ, పెట్రల్ , డీజిల్‌లను పొదుపుగా వినియోగించాలని సూచించారు.

వదంతులు వ్యప్తి చేస్తే అరెస్టు చేయాలి : సామాజిక మాధ్యమాల్లో వీడియోలు, వార్తల కారణంగానే వాహనాలు ఉన్న వారు పెట్రోలు బంకుల్లో వరుస కట్టారని కిషన్‌రెడ్డి అన్నారు. గ్యాస్ సిలిండర్ల విషయంలో వంటిళ్లలో చిచ్చు రగిలేలా చేశారని ప్రస్తావించారు. అందుకే సామాజిక మాధ్యమాల్లో వదంతులను సృష్టించే వారిని అరెస్టు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభ్యర్థించామని కిషన్‌రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఈడీ పీయూష్ మిత్తల్, బీపీసీఎల్ సీజీఎం (రిటైల్) నితీష్ సెలుకర్, హెచ్‌పీసీఎల్ సీజీఎం (రిటైల్ ) సుశీల్‌కుమార్ రాయ్ , తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేంద్రరెడ్డి, రాష్ట్ర ఎల్పీజీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అగ్నివీర్ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం.

- -జిల్లా యువజన క్రీడల అధికారి జక్కుల శ్రీనివాస్.

**బజార్ హత్నూర్, మార్చి 29: (డిడి 9వార్త న్యూస్):-**



ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ అనుమతితో భారత ప్రభుత్వం అగ్నివీర్ పథకం ద్వారా భారత సైన్యం లో 2027 సంవత్సరానికి అగ్నివీర్ నియామకాలకు పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆదిలాబాద్ జిల్లా యువజన క్రీడల అధికారి జక్కుల శ్రీనివాస్ ఒక ప్రకటన ద్వారాతెలిపారు. 171/2సంవత్సరాలు వయసు కల్గిన 2005 జులై 01 వ తేదీ నుంచి 2009 జులై 01 మధ్య జన్మించి ఉండి ,పెళ్లి కానీ పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.ఆసక్తి కల యువకులు 1 వ ఏప్రిల్ 2026నుంచి మే 1 వతేదీ వరకు (www.joinindianarmy.nic.in )వెబ్ పోర్టల్ ద్వారా భారత సైన్యం అగ్నివీర్ నియామకాలకుఆన్లైన్ ద్వారా వివరాలు కోసం సంప్రధించి దరఖాస్తులు సమర్పించు కోవచ్చని తెలిపారు.



## సనాతన సంస్కృతిని కాపాడుకోవడమే లక్ష్యం : పిట్ల కృష్ణ మహారాజ్

- రెంజల్‌లో ఘనంగా హిందూ సమ్మేళనం

**బోధన్, నిజామాబాద్ జిల్లా 29 మార్చి(డీడీ9 వార్త) :**

సమాజంలో నైతిక విలువలు పతనమవుతున్న తరుణంలో, సనాతన ధర్మాన్ని కాపాడుకుంటూ భావితరాలకు మన సంస్కృతిని అందించాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని ఆధ్యాత్మికవేత్త పిట్ల కృష్ణ మహారాజ్ ఉద్ఘాటించారు. శనివారం రాత్రి రెంజల్ మండల కేంద్రంలోని శివాలయ ప్రాంగణంలో నిర్వహించిన హిందూ సమ్మేళనం భక్తి చైతన్యంతో ఉప్పొంగింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల మధ్య, 'హర హర మహాదేవ్' నినాదాలతో రెంజల్ పురవీధులు మారుమోగాయి. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. 1925లో డాక్టర్ కేశవ్ బలిరాం హెడ్గేవార్ నాటిన చిన్న మొక్క నేడు దేశవ్యాప్తంగా లక్షలాది గ్రామాలకు విస్తరించిందని కొనియాడారు. హెడ్గేవార్ పూర్వీకులు మన జిల్లాలోని కందకుర్తి గ్రామానికి చెందిన వారు కావడం ఇందూరు గడ్డకే గర్వకారణమని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా లక్ష గ్రామాల్లో ఇటువంటి సమ్మేళనాలు నిర్వహించడం ద్వారా హిందూ సమాజాన్ని సంఘటితం చేయడమే లక్ష్యమని వివరించారు. కుటుంబ వ్యవస్థే దేశానికి వెన్నెముక అని, తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ధర్మం, శౌర్యం మరియు దేశభక్తిని నూరిపోయాలని పిట్ల కృష్ణ మహారాజ్ సూచించారు. ఛత్రపతి శివాజీ మహారాజును వీరుడిగా తీర్చిదిద్దిన జిజాబాయిని నేటి తల్లులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. స్త్రీలను మాతృరూపంలో గౌరవించే సంస్కృతి మనదని, తల్లిదండ్రుల సేవయే దైవ సేవతో సమానమని హితవు పలికారు. విదేశీ సంస్కృతి మోజులో పడకుండా, మన సనాతన కాలగణన ప్రకారం ఇది కలియుగంలో 5128వ సంవత్సరమని గుర్తిస్తూ మన పండుగలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మేళనం ద్వారా కులమతాలకు అతీతంగా హిందువులందరూ ఒకే తాటిపైకి వచ్చి ధర్మ ప్రచారంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు, ఆర్ఎస్ఎస్ బాధ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## లోక్ అదాలత్‌లో రాజీ మార్గం.. 5,662 కేసుల పరిష్కారం

**నిజామాబాద్ జిల్లా 29 మార్చి (డీడీ9 వార్త) :**



నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా గత నెల రోజుల నుండి పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కేసులను పరిష్కరించేందుకు పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా ఐపీసీ, బీఎన్ఎస్, ఈపెట్టి మరియు మోటార్ వాహనాల చట్టం కింద నమోదైన సుమారు 5662 కేసులను ఇరు వర్గాల సమ్మతితో రాజీ కుదిర్చి పరిష్కరించారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన 134 మంది బాధితులకు సంబంధించిన 31,82,649 రూపాయలను తిరిగి ఇప్పించేలా కోర్టు ఉత్తర్వులు జారీ చేయించి, ఆ కాపీలను సంబంధిత బ్యాంకు నోడల్ అధికారులకు పంపారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్ అదాలత్ ఒక గొప్ప అవకాశమని, రాజీ మార్గమే రాజా మార్గమని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ పర్యవేక్షణలో సైబర్ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు జిల్లాలో ప్రత్యేక విభాగాలు పనిచేస్తున్నాయని తెలిపారు. జిల్లాను రాష్ట్ర స్థాయిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేసిన ఏసీపీ వై. వెంకటేశ్వర్ రావ్, సీఐ ముఖిద్ పాషా మరియు ఇతర పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 నంబర్‌కు లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# బజార్హత్నూర్ మండల కేంద్రం లో గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ లేక వినియోగదారుల తిప్పలు చూడు.

- ప్రభుత్వం ఈ తిప్పలు తీర్చాలని వినియోగదారుల డిమాండ్.

**బజార్హత్నూర్, మార్చి 29:(డిడి 9వార్త న్యూస్ ):-**



ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం 31 రెవిన్యూ గ్రామాలు, హమ్లెట్గ్రామాలతో కల్సి 56గ్రామాలు ఉంటవి.ఈ మొత్తం మండలం లో వంట గ్యాస్ వినియోగించుకొను వినియోగదారులు సుమారు 15 వేల పై చిలుకు ఉంటారు. అయితే ఇంత వరకు ఒకగ్యాస్ రీఫిల్లింగ్ను ప్రభుత్వం ఏర్పాటు చేయలేక పోవడంతో వినియోగదారుల పడుతున్న కష్టాలు వర్ణింప నలవి కాదు. మొదట్లో గ్యాస్ బండ అయిపోతే ఆదిలాబాద్ ఎచ్ పి కేంద్రం నుంచి తెచ్చుకోవలసి వచ్చేది. బుకింగ్ చేసుకొని అష్టకష్టాలతో ఆదిలాబాద్ కి వెళ్లే సరికి అక్కడ సిలిండర్ లు స్టాక్ ఉంటే ఇచ్చేది. లేకుంటే గడువు పెట్టిమళ్ళీరమ్మంటే చెప్పినసమయానికి పోకుంటే సిలిండర్ దొరికేది కాదు.రాను రాను బోథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడి గొండ తదితర మండలంలలో సిలిండర్ గ్యాస్ రిఫిల్లింగ్ కేంద్రంలు ఏర్పాట్లు అయినవి. కానీ బజార్ హత్నూర్ మండలం లోని ప్రజలు ఎం పాపం చేసుకొన్నారో కానీ ఇక్కడ ఒక సిలిండర్ రిఫిల్లింగ్ కేంద్రం ఏర్పాటు కు నోచుకోలేదు. ఇప్పుడు కూడా ఇంతే స్థితి ఉంది. ఆదిలాబాద్ సిలిండర్ గ్యాస్ రిఫిల్లింగ్ స్టేషన్లో అక్కడ వారు ఒక శుభ వార్త చెప్పి మీరు సమీపంలో ఉన్న సిలిండర్ రిఫిల్లింగ్ స్టేషన్లో కి మార్చుకోవచ్చని తెలుపగా కొందరు సొనాల ప్రాంతం చుట్టాలున్న వారు బోథ్కు మరికొందరు ఇచ్చోడకు మార్చుకొన్నారు. ఇంత వరకు బాగానే ఉంది. ఇక మధ్య మధ్య ekyc ఉంటే సిలిండర్ ఇస్తారు లేకుంటే లేదంటే అగొబగో అంటూ వినియోగదారులు బోథ్, ఇచ్చోడ లకు వెళ్లి బయోమెట్రిక్( వేలిముద్ర )వేసి ఫోన్, ఆధార్ లింక్స్ చేయించిన వారికి సిలిండర్లు లభించేవి. ఆ మధ్యలో సిలిండర్ కేంద్రాలా యాజమాన్యం ఆటోలు, బొలెరో, తదితర వాహనాలు పెట్టి ఇంటింటికి సిలిండర్లు వద్దు వద్దన్నగానీ వచ్చి చేరేవి.కాలం ఎప్పుడు ఒకలా ఉండదు కదా! ఈ మధ్య ఇగో ఇజ్రాయిల్,అమెరికా, ఇరాన్ దేశాలు ఒకరంటే ఒకరు ఇగ యుద్దాలు చేస్తూ బాంబులు, మిస్సయిల్లు వేసుకోవట్టి నెల అవుతుంది. ఈ యుద్ధం కారణంగాగ్యాస్,పెట్రోల్ ,డీజిల్ కొరత ఉందని ఏజెన్సీ లు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ప్రభుత్వం కొరత లేదని చెపుతున్నారు. బజార్ హత్నూర్ మండలం వాసులకు మళ్ళీ గ్యాస్ తిప్పలు తప్పటం లేదు.ఆదిలాబాద్ వెళ్లి గ్యాస్ తెచ్చుకొనే రోజులు గుర్తుకు వస్తున్నవని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు.సిలిండర్ బుకింగ్ చేసి వెంటనే ఇంటి వద్ద మొన్నటి వరకు సిలిండర్ ఇచ్చేది. ఇప్పుడు బుక్ చేసుకొని, ekyc సరి చూసుకొని మండుటెండలో గంటల తరబడి నిల్చొని సిలిండర్ పొందాల్సిన పరిస్థితి ఉంది. ఒకసారి సిలిండర్ పొందుతే మళ్ళీ నెలపైనే గడువు.ఆ గడువు లోపల గ్యాస్ అయిపోయింది అనుకో ఇటు గ్యాస్ సిలిండర్ దొరకడం కష్టం, అటు కట్టెలు దొరకవు.ఇచ్చోడ, బోథ్ వెళ్లిన సిలిండర్ దొరకదు. ఒకప్పుడు కనీసం కిరోసిన్ లభించేది. కిరోసిన్తో స్టవ్ల మీద ఐన వంటలు చేసుకొని బుక్కెడు తిండి తినేది. అదే అన్ని మండలంలలో ఉన్నట్లు మా బజార్హత్నూర్ మండలంలో ఒక సిలిండర్ల ఏజెన్సీ ఉంటే మాకు ఇన్ని తిప్పలు ఉండేది కాదని మండలంలోని గ్యాస్ వినియోగదారులు వాపోతున్నారు.అతిరథ మహరథ రాజకీయ నాయకులు





## లోన్స్ నుండి సిబిల్ వరకు ఏప్రిల్ 1 నుండి కొత్త బ్యాంకింగ్ రూల్స్.. వీరికి పండగే..

**బజార్హత్నూర్, మార్చి 29:(డిడి 9వార్త న్యూస్ ):**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ఏప్రిల్ 1, 2026 నుండి కొత్త బ్యాంకింగ్ నిబంధనలను అమలు చేయబోతుంది. బ్యాంకు కస్టమర్లకు మేలు చేసేలా,పారదర్శకతను పెంచేలా ఆర్బీఐ ఈ కీలక మార్పులు చేసింది. అవేంటంటే..

1. నలుగురు నామినీలు ఇప్పటివరకు మీ బ్యాంకు అకౌంట్ లేదా లాకర్‌కు ఒకరిద్దరిని మాత్రమే నామినీలుగా పెట్టే వీలుండేది. కానీ ఇప్పుడు మీ బ్యాంకు అకౌంట్లు, లాకర్లకు గరిష్టంగా నలుగురిని నామినీలుగా చేర్చుకోవచ్చు. దీనివల్ల కుటుంబికులకు భవిష్యత్తులో ఆస్తుల నిర్వహణ సులభం అవుతుంది.
2. వారానికి ఒకసారి సాధారణంగా మీ సిబిల్ స్కోర్ ప్రతి నెలకి ఒకసారి మాత్రమే అప్‌డేట్ అయ్యేది. కానీ కొత్త రూల్ ప్రకారం ప్రతి 7 రోజులకు ఒకసారి మీ సిబిల్ స్కోర్ అప్‌డేట్ అవుతుంది.. అంటే ప్రతి నెల 7, 14, 21, 28 తేదీల్లో. దీని వల్ల లాభం ఏంటంటే మీరు అప్పు కట్టగానే ఆ వివరాలు వెంటనే స్కోర్‌లో కనిపిస్తాయి. దీనివల్ల లోన్ కోసం ప్రయత్నించే వారు సిబిల్ స్కోరును త్వరగా పెంచుకోవచ్చు.
3. ఛార్జీలు సున్నా!చాలామంది దగ్గర డబ్బు ఉన్నప్పుడు లోన్‌ను ముందే క్లోజ్ చేయాలనుకుంటారు. కానీ బ్యాంకులు 'ఫోర్‌క్లోజర్' లేదా 'ప్రీపేమెంట్' పేరుతో జరిమానా వసూలు చేసేవి. ఇకపై ఫ్లోటింగ్ వడ్డీ రేటు ఉన్న హోమ్ లోన్, కార్ లోన్, ఎడ్యుకేషన్ లేదా పర్సనల్ లోన్లపై ముందస్తు చెల్లింపు లకు ఛార్జీలు ఉండవు. అంటే ఎక్స్‌ట్రా ఖర్చు లేకుండా మీ అప్పును ఎప్పుడైనా తీర్చేయవచ్చు.
4. వ్యాపారులకు ఊరట బంగారు ఆభరణాల వ్యాపారులు తీసుకునే 'గోల్డ్ మెటల్ లోన్' (GML) తిరిగి చెల్లించే గడువును పెంచారు. ఇంతకు ముందు పాత గడువు 180 రోజులు ఉండేవి. కానీ కొత్త గడువు 270 రోజులు చేసారు. దీనివల్ల నగల వ్యాపారులకు నగదు నిర్వహణ ఈజీ ఆవుతుంది.
5. తక్కువ వడ్డీకే లోన్లు మీ క్రెడిట్ స్కోర్ ప్రతి వారం అప్‌డేట్ అవుతుంది కాబట్టి, మంచి స్కోర్ ఉన్నవారు బ్యాంకులతో మాట్లాడి తక్కువ వడ్డీ రేట్లు పొందవచ్చు. మంచి క్రెడిట్ ప్రొఫైల్ ఉంటే.. బ్యాంకులు ఇచ్చే ఆఫర్ల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదు. వెంటనే తక్కువ వడ్డీకి లోన్ పొందే ఛాన్స్ ఉంటుంది.

## ఏప్రిల్ 1,2వ తేదీలు తెరిచే ఉంటవి కానీ, లావాదేవీ లుండవు




**బజార్హత్నూర్, మార్చి 29: (డిడి 9 వార్త న్యూస్ ):-**

ఏప్రిల్ 1 , 2 వ తేదీలు నాన్ బ్యాంకింగ్ హాలిడేస్. అంటే బ్యాంకు ఓపెన్ అయ్యే ఉంటాయి.కానీ ఎటువంటి ట్రాన్సక్షన్స్ వుండవు ఏప్రిల్ 3 గుడ్ ఫ్రైడే.. బ్యాంకులు సెలవు ఏప్రిల్ 4వ తేదీన జీతాలు.. క్రెడిట్ అయితే పరవాలేదు. మళ్ళీ ఏప్రిల్ 5తేదీన ఆదివారం అంటే ఆరోజు కూడా బ్యాంకులు సెలవు.మళ్ళీ 6వ తేదీనే జీతం క్రెడిట్ అయ్యే అవకాశం ఉంది. అందుకే, 6వ తేదీ లోపు ఏమైనా ఖర్చులుంటే అనగా.. EMI లేదా ఇతర ఖర్చులు వాటికి ఇబ్బంది లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటే మంచిది•

# సీనియర్ నాయకుడి మృతి పార్టీకి తీరని లోటు.

- రవీందర్ అంతక్రియల్లో పాల్గొన్న ఆడే గజేందర్
- పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి ఘన నివాళులు

**బజార్హత్నూర్, మార్చి 29 (డిడి 9వార్త న్యూస్ ):-**

ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రవీందర్ మృతి పార్టీకి తీరని లోటని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆదివారం రోజు రవీందర్ అంతక్రియల్లో పాల్గొని, ఆయన పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి ఘన నివాళులు



అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి తన ప్రగాఢ సానుభూతి లో పలువురు



తెలిపారు.గ్రామం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై రవీందర్‌కు తుదివీడ్కోలు పలికారు.





# రెండు వారాల్లో 471 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

- **రూ. 43 లక్షల భారీ జరిమానా**

**నిజామాబాద్ జిల్లా 29 మార్చి (డీడీ9 వార్త) :**

యువత సన్మార్గంలో నడిచినప్పుడే దేశ భవిష్యత్తు బాగుంటుందని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పిలుపునిచ్చారు. ఆదివారం నిజామాబాద్ రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో సే నో టు డ్రగ్స్ ఎస్ టు లైఫ్ అనే నినాదంతో నిర్వహించిన 2కే రన్ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని బైపాస్ చౌరస్తా నుండి ఐడీఓసీ కార్యాలయం వరకు సాగిన ఈ పరుగులో వందలాది మంది విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... యువత తమలోని శక్తి సామర్థ్యాలను దేశాభివృద్ధికి వినియోగించాలని, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. సమాజంలో ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, అలాంటి సమాచారం తెలిస్తే వెంటనే 100 లేదా 1908 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. డ్రగ్ ఫ్రీ సొసైటీ కోసం ప్రజలు, మీడియా, యువత కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు గంజాయి వల్ల కలిగే అనర్థాలపై ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు అందరినీ ఆలోచింపజేశాయి. పరుగులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీపీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ జి. బస్వా రెడ్డి, ఏసీపీలు ప్రకాష్, మస్తాన్ అలీ, రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు షరీఫ్, ఆనంద్ సాగర్ మరియు వివిధ కళాశాలల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## రెండు వారాల్లో 471 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

- **రూ. 43 లక్షల భారీ జరిమానా**

**నిజామాబాద్ జిల్లా 29 మార్చి (డీడీ9 వార్త) :**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ వాహనదారులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత రెండు వారాల కాలంలో మార్చి 16 నుండి 28వ తేదీ వరకు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లతో పాటు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన ముమ్మర తనిఖీల్లో మొత్తం 471 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం వారికి ఏకంగా 43,30,000 రూపాయల జరిమానా విధించింది. వీరిలో నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించిన 38 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష కూడా పడిందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టినట్లు అవుతుందని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా తమ వెంట వాహన పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని మరియు ట్రాఫిక్ నిబంధనలను పాటించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి..

- **తెలంగాణ కోసం కేసులు మోసింది మేము..**
- **అయోమయంలో తెలంగాణ ఉద్యమకారులు....**
- **ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు గుంజాల భాస్కర్ రెడ్డి..**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 29 (డి డి వార్త ):-**

సోనాల మండల కేంద్రంలోని భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఆనాడు 2001 నుండి 2014 చురుకైన ఉద్యమంలో పాల్గొని తెలంగాణ రావడం కోసం ఎంతో కృషిచేసి కేసులు మూసి సంవత్సరాలు తరబడి కోర్ట్ లు చుట్టు తిరుగుతూ ఆర్థికంగా ఎంతో నష్టపోయాం. అయినా ప్రభుత్వం మా వైపు చూడకపోవడం చాలా బాధాకరమన్నారు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తీర్పును వెంటనే అమలుపరిచి నెలకు 25వేల పెన్షన్ తో పాటు ఇంటి స్థలం ఇచ్చి గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో సోనాల మండలం నూతన అధ్యక్షులు రామాయి. సదానందం ప్రధాన కార్యదర్శి లోలపు. పోశెట్టి ఉపాధ్యక్షులు షేక్ మహమ్మద్, చిలుకూరి నరేందర్, భీంరావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



# వయోజనులకు ఉల్లాస్ అక్షరాస్యత పరీక్షలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 29 మార్చి (డీడీ9 వార్త) :**

నిరక్షరాస్యత నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉల్లాస్ వయోజన అక్షరాస్యత పరీక్షలు ఆదివారం నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో ఉత్సాహంగా జరిగాయి. రెంజల్ మండలం నీలా గ్రామంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షల్లో వయోజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అక్షరాస్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమాజంలో నిరక్షరాస్యతను పారదోలడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మోహన్, సీసీ మని, సర్పంచ్ క్యాతం యోగేశ్, ఐకేపీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎడపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో నిరక్షరాస్యులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించినట్లు మండల ఐకేపీ ఏపీఎం రాజేందర్ తెలిపారు. మండల వ్యాప్తంగా సుమారు వెయ్యి మందికి పైగా నిరక్షరాస్యులను గుర్తించి, వారికి స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మహిళల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు పరీక్షలు రాసేందుకు వీలు కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, సీసీ సాయిలు, వీవోఏలు పాల్గొని పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.






## క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు : సీపీ సాయి చైతన్య

- **గిరిరాజ్ కళాశాలలో ఘనంగా క్రీడా పురస్కారాల ప్రదానోత్సవం**

**నిజామాబాద్ జిల్లా 29 మార్చి(డీడీ9 వార్త) :**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే పరిపూర్ణమైన వ్యక్తిత్వం అలవడుతుందని జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వార్షిక క్రీడా పురస్కారాల ప్రదానోత్సవ వేడుకకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక ఉల్లాసానికి, క్రమశిక్షణకు దోహదపడతాయని వివరించారు. ఓటమిని కూడా గెలుపునకు పునాదిగా భావించి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కళాశాల వార్షికోత్సవం మరియు క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవరి నుంచి మార్చి వరకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. ముఖ్యంగా అంతర్జాతీయ, జాతీయ మరియు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి గిరిరాజ్ కళాశాల కీర్తిని దశదిశలా చాటిన అథ్లెట్లను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించి, వారికి జ్ఞాపికలను ప్రదానం చేశారు. కళాశాల అంతర్గత పోటీల్లో భాగంగా లైఫ్ సైన్సెస్, ఆర్ట్స్, కామర్స్ మరియు ఫిజికల్ సైన్స్ విభాగాల విద్యార్థులు హోరాహోరీగా తలపడ్డారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులతో పాటు ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ల సేవలను కూడా ఈ వేదికపై కొనియాడారు. విద్యార్థులు లక్ష్య సాధనలో పట్టుదలగా ఉండాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, వ్యాయామ విద్యా సంచాలకులు, విద్యార్థులు పాల్గొన్నారు.







# కొండేక్కిన కోడి...దిగింది..!వంద రూపాయలు తగ్గిన చికెన్ రేటు.

**కిలో 270 కి... బ్రాయిలర్ చికెన్.**

**బజార్హత్నూర్, మార్చి 29**
**(డిడి 9వార్త న్యూస్ ):-**

ఈ మధ్యకాలంలో పౌల్ట్రీ కోడి మాంసము రేటు గణనీయంగా పెరగడంతో చికెన్ ప్రియులకు ఇది పెద్ద ఇబ్బందిగానే మారింది. అంతగా కొండేక్కిన కోడి రేటును చూసి అయ్యో అంటూ తినకుండా మానుకున్న రోజులు ఉన్నాయి. ఇక ఇప్పుడిప్పుడే కొండేక్కిన కోడి రేటు మాత్రం మెల్లగా దిగి వస్తుంది. ప్రస్తుతం చికెన్ రేటు మార్కెట్లో 270 కిలోగా అమ్మకాలు జరుగుతున్నాయి.

**ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు.. కోళ్ల పెంపకం, లభ్యతను బట్టి ధరలు.**

చికెన్ లవర్స్ కు ఇది నిజంగా గుడ్ న్యూసే. గతవారం భారీగా పెరిగిన చికెన్ ధరలు.. ఈ వారం అమాంతం తగ్గిపోయాయి. మార్చి నెల ఆరంభంలో కిలో చికెన్ ధర రూ.360 రూ.400 పలికింది. వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో కోళ్లు చనిపోవడం, వాటి దాణా ఖర్చులు పెరగడంతో కోళ్ల ఫారమ్ల యజమానులు ధరలను పెంచారు. ఇదే సమయంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు కూడా ఉండటంతో చికెన్ కు గిరాకీ ఏర్పడింది. వెరసి స్కిన్ లెస్, నార్మల్ చికెన్ ధర కూడా ఆల్ టైమ్ రికార్డుకు చేరింది. గతవారం కేజీ చికెన్ ధర ఏకంగా రూ.400కు చేరడంతో.. చికెన్ ప్రియులంతా సీ ఫుడ్ వైపు మళ్లారు. వారంరోజుల తర్వాత కిలో చికెన్ రేటు ఏకంగా రూ.100 వరకూ తగ్గింది. హైదరాబాద్ లో నేడు స్కిన్ లెస్ చికెన్ కేజీ ధర రూ.270గా ఉండగా.. అటు వరంగల్ లోనూ అదే ధర కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ లోని అమలాపురంలో మాత్రం రూ.300350 పలుకుతోంది. ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు, కోళ్ల పెంపకం, లభ్యతను బట్టి



ధరలు మారుతుంటాయని వ్యాపారస్తులు తెలిపారు.

# డీలిమిటేషన్ ప్రక్రియ–దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం కాకూడదు

ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 29(డి డి వార్త): భారతదేశంలో డీలిమిటేషన్ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక భాగం. జనాభా మార్పులకు అనుగుణంగా పార్లమెంట్ మరియు అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రక్రియ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే విధంగా మారకూడదు. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో, విద్య, ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధి రంగాలలో ముందంజలో ఉన్నాయి. ఈ క్రమంలో కేవలం జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపు జరిపితే, ఈ రాష్ట్రాలు తమ ప్రతినిధిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తికే విరుద్ధం. అందువల్ల, సీట్ల కేటాయింపు కేవలం జనాభా ఆధారంగా కాకుండా అభివృద్ధి సూచికలు, పరిపాలన సామర్థ్యం, సామాజిక పురోగతి వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఇది సమతుల్యతను కాపాడటానికి అవసరం. ఉదా: 50% సీట్ల పెంపు తో దేశంలోని లోక్సభ స్థానాలు 816 కు చేరుతాయి, 50% శాతం సీట్ల పెంపుతో కేవలం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుతం ఉన్న 80 సీట్ల నుండి 120 స్థానాలకు, బీహార్ 40 నుండి 60 కి, మహారాష్ట్ర 48 నుండి 72, వెస్ట్ బెంగాల్ 42 నుంచి 63 పెరుగుతుంది. 816లో మ్యాజిక్ ఫిగర్ 408 మాత్రమే అంటే కేవలం ఈ నాలుగు రాష్ట్రాల ద్వారానే 315 సీట్లు పోంది దేశ రాజకీయాలలో ఏకాఛత్రాధిపత్యం చలాయిస్తాయి . దీంతో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. అదేవిధంగా, రాజ్యసభలో ప్రతి రాష్ట్రానికి సమాన ప్రాతినిధ్యం కల్పించే విధంగా సీట్ల కేటాయింపును పునఃపరిశీలించడం అవసరం. అమెరికా తరహా రాజ్యసభ ( సెనేట్ ) లో ప్రతి రాష్ట్రం నుండి జనాభా తో సంబంధం లేకుండా ఇద్దరు చొప్పున సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుంది అలాగే రాజ్యసభకు జనాభాతో సంబంధం లేకుండా రాజ్యసభ సీట్లను ప్రతి రాష్ట్రానికి సమానంగా కేటాయించాలి. రాజ్యసభను నిజమైన ఫెడరల్ చాంబర్‌గా మార్చగలిగితే రాష్ట్రాల మధ్య సమానత్వం ప్రతిబింబించబడుతుంది. అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని ఒక భారత పౌరుడిగా కోరుతున్నాను.





# రిషబ్‌శెట్టి సంచలన నిర్ణయం

- **హోంబలే ఫిల్మ్స్ సహా పలువురి సోషల్ మీడియా అన్‌ఫాలో**

దక్షిణాది సినీ పరిశ్రమలో సోషల్ మీడియా ప్రభావం ఎలా ఉంటుందో మరోసారి రుజువైంది. రిషబ్ శెట్టి చేసిన పని ఇప్పుడు టాలీవుడ్, సాండల్‌వుడ్ ఇండస్ట్రీల్లో హాట్ టాపిక్‌గా మారింది. తనకు బ్రేక్ ఇచ్చిన నిర్మాణ సంస్థతో పాటు అత్యంత సన్నిహితులను కూడా సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేయడం సంచలనంగా మారింది. ప్రత్యేకంగా 'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి భారీ చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ అధికారిక ఖాతాను రిషబ్ శెట్టి అన్‌ఫాలో చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఆ సంస్థ అధినేత విజయ్ కిరగందూర్ వ్యక్తిగత ఖాతాను మాత్రం ఇంకా ఫాలో అవుతుండటం గమనార్హం. దీంతో సమస్య సంస్థతోనా? లేక నిర్వహణతోనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇది మాత్రమే కాదు, కన్నడ ఇండస్ట్రీలో తనకు అత్యంత సన్నిహితుడైన రాజ్ బి. శెట్టిను కూడా రిషబ్ అన్‌ఫాలో చేయడం మరింత చర్చనీయాంశమైంది. వీరిద్దరూ కలిసి ఎదిగిన స్నేహితులు కావడంతో ఈ పరిణామం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. అదేవిధంగా 'కాంతార' చిత్రంలో నటించిన రుక్మిణి వసంత్‌ను కూడా అన్‌ఫాలో చేయడం ఊహాగానాలకు తావిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో నెటిజన్లు వివిధ కోణాల్లో చర్చిస్తున్నారు. ఇది నిజంగానే వ్యక్తిగత విభేదాల ఫలితమా? లేక కొత్త సినిమా ప్రమోషన్ కోసం వేసిన స్ట్రాటజీనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే, రిషబ్ శెట్టి కెరీర్ ప్రస్తుతం పీక్స్‌లో ఉంది. కాంతార సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా జై హనుమాన్ చిత్రంలో హనుమంతుడి పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే ఛత్రపతి శివాజీ మహారాజ్ బయోపిక్‌లో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సక్సెస్ సమయంలో టీమ్ సభ్యులను సోషల్ మీడియా నుంచి దూరం పెట్టడం వెనుక అసలు కారణం ఏమిటనేది ఇప్పటికీ మిస్టరీగానే ఉంది. రిషబ్ శెట్టి ఈ అంశంపై స్పందించే వరకు ఈ సస్పెన్స్ కొనసాగడం ఖాయం.



# చెల్లి నిర్మాత... అన్న హీరోగా బరిలోకి

వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్క•తి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌తో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదువంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.




# దురంధర్2 ఓ చెత్త సినిమా అక్కసు వెళ్లగక్కిన ఓవైసీ

ధురంధర్ 2' సినిమాపై హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ 'తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్నప్పటికీ, ఒవైసీ మాత్రం దీనిని ఒక చెత్త సినిమాగా అభివర్ణించారు. ఒక మీడియా సదస్సులో ఒవైసీ మాట్లాడుతూ.. 'ధురంధర్ 2' వంటి మూడు గంటల పనికిరాని సినిమాలను చూసే సమయం తనకు లేదని అన్నారు. ఈ చిత్రం పూర్తిగా హింసను ప్రేరేపించేలా ఉందంటూ ఆయన మండిపడ్డారు. అసలు అది ఒక సినిమానా? అందులో మూడు గంటల పాటు కేవలం బూతులు, హింస తప్ప మరేమీ లేదు' అని ఆయన కొట్టిపారేశారు. ఈ సినిమాలో ముస్లింలను చిత్రీకరించిన విధానంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఈ సినిమాకు బ్రహ్మరథం పడుతున్నారని గుర్తు చేయగా.. ఆయన తనదైన శైలిలో హైదరాబాదీ యాసలో స్పందిస్తూ, ఇలాంటి విషయాలను తాను పట్టించుకోనని తేల్చి చెప్పారు.



# అక్షయ్‌ఖన్నాకు ప్రశాంత్ గ్రీటింగ్స్

- **మహాకాళిపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ప్రకటన**

బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కేవలం తన నటనతోనే మాట్లాడతారని, ఆయనతో కలిసి పనిచేయడం తనకు దక్కిన గౌరవమని ప్రశాంత్ వర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ప్రశాంత్ వర్మ ప్రత్యేక పోస్ట్ను పంచుకున్నాడు. నిజమైన టాలెంట్‌కు అరుపులు అవసరం లేదని నిరూపించే నటుడు అక్షయ్ ఖన్నా. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, పెర్ఫార్మెన్స్ ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన క్లాస్‌ను చాటుతాయని ప్రశాంత్ వర్మ కొనియాడారు. అలాగే ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న 'మహాకాళి', 'అధీర', మరియు 'జై హనుమాన్' చిత్రాల గురించి త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ ఇస్తామని హింట్ ఇచ్చాడు. అక్షయ్ ఖన్నా ప్రస్తుతం ప్రశాంత్ వర్మ నిర్మిస్తున్న 'మహాకాళి' చిత్రంలో అసుర గురువు 'శుక్రాచార్యుడి' పాత్రలో నటిస్తున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం కావడం విశేషం. ప్రస్తుతం అక్షయ్ ఖన్నాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ పూర్తయిందని, అవుట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చిందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ వర్మ క్రియేట్ చేస్తున్న ఈ మైథలాజికల్ యూనివర్స్ కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

# కొత్త సినిమా కోసం మారుతి కసరత్తు



రాజా సాబ్ సినిమాతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన దర్శకుడు మారుతి సైలెంట్ అయ్యారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న మారుతి తాజాగా తన తదుపరి ప్రాజెక్ట్పై అప్డేట్ ఇచ్చాడు. తన కొత్త సినిమా స్క్రిప్ట్ ప్రస్తుతం చివరి దశలో ఉందని, ఈ ప్రాజెక్ట్కు శ్రీరాముడి ఆశీస్సులు ఉన్నాయని ఆయన పేర్కొన్నాడు.ఇదిలా ఉండగా, మారుతి తదుపరి సినిమాకు 'హ్యాపీ పొంగల్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, తనకు సొంతమైన కామెడీ శైలిలో తెరకెక్కించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగా హీరో వైష్ణవ్ తేజ్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. 'రాజాసాబ్' ఫలితం తర్వాత మారుతి మరింత జాగ్రత్తగా స్క్రిప్ట్పై పని చేస్తున్నట్లు కనిపిస్తోంది. తన తదుపరి సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావాలని ఈ దర్శకుడు భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్పై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



## క్లాసిక్ లుక్‌లో ఆకట్టుకుంటున్న యంగ్ హీరోయిన్

మోస్ట్ బ్యూటిఫుల్ నటి నేహా శెట్టి 'మెహబూబా' చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ ద్వారా ఈమెకు పెద్దగా గుర్తింపు దక్కలేదు. ఆ తర్వాత హిట్ కోసం ఈమె చాలా కాలం ఎదురు చూడాల్సి వచ్చింది. అలాంటి సమయంలోనే 2022లో విడుదలైన 'డీజే టిల్లు' చిత్రంతో ఈమెకు మంచి విజయం దక్కింది. దాంతో ఒక్కసారిగా ఈమె పేరు తెలుగు చిత్రసీమలో మారుమోగడం మొదలైంది. ఆ తర్వాత నేహా పలు చిత్రాలలో నటించినప్పటికీ, అందులో ఏదీ 'డీజే టిల్లు' స్థాయి విజయాన్ని సాధించలేదు.అయితే ఈమె నటించిన 'బెదురులంక 2012' మాత్రం మంచి విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం ఈమె చేతిలో ఎక్కువ సినిమాలు లేకపోయినా, సినిమాల్లో అందాలను ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె సామాజిక మాధ్యమాల్లో కూడా బాగా అలరిస్తోంది.తాజాగా ఈ నటి తన సోషల్ మీడియా ఖాతాలో కొన్ని ఫోటోలను పోస్ట్ చేసింది. ఆ ఫోటోలలో ఈమె లేత గులాబీ రంగు చీరతో పాటు అందమైన ఎంబ్రాయిడరీ ఉన్న బ్లౌజ్ ధరించింది. మెడలో బంగారు హారం, చెవులకు జుమ్కాలు, నుదిటిపై టిక్కా ధరించి సంప్రదాయ లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మెరిసిపోతోంది.